

చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి. మార్కెట్‌కు 719 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



శ్రీమంతులు

పొట్టచేతబట్టుకుని నగరానికి వలసవెళ్లిన యువకులు ఏకంగా నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు. స్వగ్రామాల్లోని యువతకు దారి చూపుతున్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం

40.4°/22.1°

శుక్రవారం జిల్లాలో ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. సాయంత్రం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు నిలిచిన ఇన్‌ఫ్లో



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్‌: తుంగభద్ర జలాశయానికి శుక్రవారం ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం 4.940 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 40.450 టీఎంసీల నీరు నిల్వ ఉండి, 454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండేది. డ్యాంలో ప్రస్తుతం 1580.94 అడుగుల వద్ద నీటి మట్టం ఉంది. శుక్రవారం ఇన్‌ఫ్లో 0 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో జలాశయంలో ఆశించిన స్థాయిలో నీరులేక కళ తప్పింది.

స్నాతకోత్సవానికి 8,327 దరఖాస్తులు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవం జూలై 17న నిర్వహించనున్నారు. స్నాతకోత్సవ నిర్వహణ ఏర్పాట్లలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. ఏపీ గవర్నర్, యూనివర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. గవర్నర్ హాజరవుతారని ఇప్పటికే వర్సిటీ ఉన్నతాధికారులకు అధికారికంగా సమాచారం అందినట్లు తెలిసింది. స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తం అయ్యారు. 2021–22 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఈ స్నాతకోత్సవానికి మొత్తం 8,327 దరఖాస్తులు అందాయి. గత స్నాతకోత్సవంతో పోలిస్తే తక్కువ దరఖాస్తులు వచ్చాయి. 68 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు గాను 61 మంది నేరుగా గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు అందుకోనున్నారు. గౌరవ డాక్టరేట్‌కు సంబంధించి గవర్నర్ ఆమోదం పొందిన తరువాత ప్రకటించనున్నారు.

డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న డీఎం శ్రీనివాసరావు

హిందూపురం: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే నిమిత్తం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న బస్సు డ్రైవింగ్‌లో శిక్షణ తరగతులను శుక్రవారం డీఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసిన వారికి ప్రభుత్వం నుంచి డ్రైవింగ్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఈ సర్టిఫికెట్‌తో ఆర్టీసీలో ఉద్యోగ అవకాశాలు పొందటానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అలాగే ప్రైవేట్ కంపెనీలు, విదేశాల్లో కూడా బస్సు డ్రైవర్‌గా ఉపాధి పొందడానికి సర్టిఫికెట్ దోహదపడుతుందన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్ రాంనిశాంత్, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ రఫీక్ మాట్లాడుతూ 32 రోజుల శిక్షణ తీసుకునే నిరుద్యోగులు లైట్ వెహికల్ లైసెన్స్ కల్గి ఉండి శిక్షణ కోసం రూ. 23,600 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,400 మెగావాట్ల సోలార్ విద్యుత్ తయారీ కేంద్రంగా ఎన్‌పీకుంట (నంబులపూలకుంట) అవతరించనుంది. ఇక్కడి వాతావరణ పరిస్థితులు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. దీంతో బడా కంపెనీలు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు పోటీ పడుతున్నాయి.



సౌర వెలుగులు

- అనువైన ప్రాంతంగా ఎన్‌పీకుంట
- సుమారు 9వేల ఎకరాల్లో వివిధ కంపెనీల ప్రాజెక్టులు
- పెట్టుబడులు పెట్టేందుకు బడా కంపెనీలు రెడీ
- మొన్నటివరకూ సాధారణ మండల కేంద్రం
- ఇప్పుడు గూగుల్‌లో ఎన్‌పీ కుంట అనగానే సోలార్ వివరాలు ప్రత్యక్షం
- 1,400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి కేరాఫ్‌గా నిలుస్తున్న వైనం
- మరో 3వేల మెగావాట్లతో త్వరలోనే కళ్యాణదుర్గంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు



ఎన్‌పీకుంటలోని పవర్ గ్రిడ్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: నిన్న, మొన్నటి వరకూ ఆ ఊరు పేరు చాలామందికి తెలియదు. అన్ని మండలాల మాదిరే అదీ ఒక సాదాసీదా ప్రాంతం. మెట్ట పైర్లు వేసుకుంటూ జీవనం సాగించే రైతులు.. వారితో పాటే రైతు కూలీలు నివసించేవారు. ప్రతి ఊరికీ ఒక రోజు వస్తుందన్నట్టు ఇప్పుడు ఈ ఊరు రాష్ట్రంలోనే ఒక పేరుమోసిన పవర్ హబ్‌గా మారింది. కదిరి నియోజకవర్గంలో ఉండే ప్రాంతమే నంబులపూలకుంట. ఎన్‌పీ కుంటగా పిలుచుకునే ఈ మండల కేంద్రం ఇప్పుడు ఏపీలో సోలార్ పవర్‌హబ్‌గా మారింది. గూగుల్‌లోనూ ఈ ఊరికి చోటు దక్కింది.

క్యూ కడుతున్న బడా కంపెనీలు

దేశంలో పేరుమోసిన బడా కంపెనీలు ఇక్కడ సోలార్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేశాయి. మరి కొన్ని కంపెనీలు సైతం ఇక్కడకు వస్తున్నాయి. ఇప్పటికే ఆరేడు కంపెనీలు పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయగా, మరో కొత్త కంపెనీ (హెచ్‌పీసీఎల్) త్వరలోనే తమ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి సిద్ధం చేసింది. ఎన్‌పీ కుంట కేంద్రంగా 1,400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కానున్నట్టు అధికార వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వానికే కరెంటు

ప్రస్తుతం ఇక్కడ ఉత్పత్తి అవుతున్న కరెంటును రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఒక్కో యూనిట్ రూ.2.70కు కొనుగోలు చేస్తున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. ప్రభుత్వమే ఆయా కంపెనీలకు భూములు తక్కువ ధరకు ఇచ్చింది కాబట్టి ఉత్పత్తి అయిన కరెంటును ప్రభుత్వానికే ఇచ్చేలా ఒప్పందం జరిగింది. త్వరలోనే కళ్యాణదుర్గంలోనూ 3వేల మెగావాట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

పరిశ్రమల రాకతో భూములకు రెక్కలు

అప్పటివరకూ నంబులపూలకుంట అంటే ఎవరికీ పెద్దగా తెలియదు. వర్షాధార పంటలతో బతికే సన్న, చిన్నకారు రైతులు, రైతు కూలీలకు మాత్రమే ఆ ఊరు పరిమితం. పెద్ద పెద్ద సోలార్ పరిశ్రమల రాకతో ఈ ప్రాంతంలో భూములకు రెక్కలొచ్చాయి. గతంలో రూ.5 లక్షలున్న ఎకరా ఇప్పుడు రూ.20 లక్షల ధర పలుకుతోంది. పవర్ ప్లాంట్లతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఈ ప్రాంతంలో గతంతో పోల్చితే ఇప్పుడు రోడ్డు రవాణా సౌకర్యం మరింత మెరుగైంది.



ఎన్‌పీకుంటలో సోలార్ ప్లాంట్ పెట్టిన కంపెనీలు	సామర్థ్యం (మెగావాట్లలో)
ఎన్‌టీపీసీ	250
ఆయానా	250
స్ప్రింగ్ పవర్	250
సాఫ్ట్‌బ్యాంక్	250
టాటా పవర్	100
ఆక్‌మీ	150
హెచ్‌పీసీఎల్ (కొత్తగా)	100

అత్యంత అనుకూల పరిస్థితులున్నాయి

కదిరి నియోజకవర్గం ఎన్‌పీ కుంటలో పవర్‌ప్లాంట్ల ఏర్పాటుకు అత్యంత అనుకూల పరిస్థితులున్నాయి. దీనికి తోడు ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం కూడా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహాలందిస్తోంది. దీంతో ఎక్కువమంది ఇక్కడ పవర్‌ప్లాంట్ల నిర్మాణానికి ఆసక్తి చూపుతున్నారు. – శివశంకర్ నాయుడు, డీఈ, సోలార్ పవర్ కార్పొరేషన్

నేటి నుంచి గుంతకల్లు–చిక్‌జాజూర్ రైళ్లు తాత్కాలిక రద్దు



రాయదుర్గంటౌన్: గుంతకల్లు – చిక్‌జాజూర్ స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 17 నుంచి తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు సౌత్ వెస్ట్రన్ రైల్వే హుబ్లి డివిజన్ అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ జేపీ యోగేష్ తెలిపారు. బళ్లారి – రాయదుర్గం సెక్షన్ పరిధిలో సేఫ్టీ పనులు జరుగుతున్నందున ఈ నెల 17 నుంచి 28 వరకు 12 రోజులపాటు గుంతకల్లు – చిక్‌జాజూర్ స్పెషల్ ప్యాసింజర్ (07586), చిక్‌జాజూర్ – గుంతకల్లు స్పెషల్ ప్యాసింజర్ (07585) రైళ్ల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. 29 నుంచి రైళ్ల పునరుద్ధరిస్తామన్నారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

జిల్లాకు వర్ష సూచన



బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ నెల 18 నుంచి 21వ తేదీలోపు తేలికపాటి నుంచి మధ్యస్థ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 34.6–38.8, రాత్రి ఉష్ణోగ్రతలు 24.2–26.1 డిగ్రీల సెల్సియస్ నమోదు కావొచ్చని పేర్కొన్నారు. గాలిలో తేమ శాతం ఉదయం 65–81, మధ్యాహ్నం 32–58గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఇంటికే వెళ్లి సమస్య పరిష్కరించాలి

- 'జగనన్న సురక్ష' లక్ష్యం ఇదే
- రోజూ లక్ష మందికి ఉపాధి కల్పించాలి
- ఎరువులు, విత్తనాల కొరత రాకూడదు
- సమీక్షలో కలెక్టర్ అరుణ్‌బాబు



జిల్లా అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ''జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అధికారులే ఇంటింటికీ వెళ్లి సమస్యలు ఆరా తీయాలి. ఏవైనా సమస్య ఉన్నట్లు ప్రజలు చెబితే అక్కడికక్కడే సచివాలయాల ద్వారా పరిష్కరించాలి. అలాగే జిల్లాలో రోజూ కనీసం లక్ష మందికి 'ఉపాధి' కల్పించాలి. కూలీకి రోజుకు రూ.272 వేతనం అందేలా చూడాలి. ఖరీఫ్‌లో రైతులకు కావాల్సినన్ని ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి. కొరత అనే మాటే వినిపించకూడదు...ఎక్కడైనా కల్తీలు కనిపిస్తే వ్యవసాయాధికారులను బాధ్యులను చేస్తాం'' అని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జాయింట్ కలెక్టర్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి తదితరులతో కలిసి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలు సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడం, అర్హులందరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా ఈనెల 23 నుంచి జూలై 23వ తేదీ వరకూ 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు.

ప్రతి ఇంటికీ వెళ్లాలి.. సమస్యలు అక్కడే పరిష్కరించాలి

ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి 'జగనన్న సురక్ష' గురించి వివరించాలని కలెక్టర్ తెలిపారు. అలాగే ఆదాయ, వివాహ, మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ ఓ బృందంగా, తహసీల్దార్, ఈఓఆర్డీ మరో బృందంగా ఏర్పడి గ్రామాలకు వెళ్లాలని, ఆయా గ్రామాల సందర్శన షెడ్యూల్ ప్రజలకు ముందుగానే తెలపాలన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవాలన్నారు. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కోసం ప్రత్యేక డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది బృందంగా ఏర్పడి గృహాలు సందర్శించాలన్నారు. 'జగనన్న సురక్ష'లో వివిధ పథకాలకు అర్హులుగా గుర్తించిన వారికి ఆగస్టు 1న పథకం అందేలా చూస్తామన్నారు. అలాగే 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ప్రజాప్రతినిధులు గుర్తించిన 1,720 పనులను ఆమోదించడం జరిగిందని, 1,308 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అలాగే జూలై 15 నాటికి జిల్లాలో 4,500 ఇళ్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీలను అధికారులు సందర్శించాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, ఏడీ రామకృష్ణ, కృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, జిల్లా రిజిస్ట్రార్ కృష్ణకుమారి, డ్వామా పీడీ రామాంజనేయులు, తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- జాయింట్ కలెక్టర్ చేతన్



మాట్లాడుతున్న జేసీ చేతన్, చిత్రంలో ఏఎస్పీ విష్ణు, సబ్‌కలెక్టర్ కార్తీక్

పుట్టపర్తి అర్బన్: ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అడిషనల్ ఎస్పీ విష్ణు, సబ్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి రహదారి భద్రతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్‌ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. గత ఏడాది మే నెలలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 32 మంది మరణించగా, ఈ ఏడాది 22 మంది మృత్యువాత పడ్డారన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్రాసింగ్‌ల వద్ద లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కంటైనర్లు నిలిపితే చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ రోడ్లపై అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి కరుణసాగర్‌రెడ్డి, ఎంవీఐలు రమణ, వరప్రసాద్, రాణి, అసిస్టెంట్ మేనేజర్ భరత్ భూషణ్, డీఈఈ జగదీష్ గుప్తా, ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎం మధుసూదన్, రోడ్డు సేఫ్టీ మెడికల్ ఆఫీసర్ సాహిత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ- స్టాంపులతో అక్రమాలకు చెక్

- అనంతపురంలో ఈ-స్టాంపింగ్ కేంద్రం ప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో దశల వారీగా కేంద్రాల ఏర్పాటు
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి వెల్లడి



ఈ స్టాంపును అందజేస్తున్న డీఐజీ మాధవి, చిత్రంలో జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం

అనంతపురం టౌన్: ఈ– స్టాంపింగ్ విధానంతో అక్రమాలకు తావుండదని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ మాధవి అన్నారు. శుక్రవారం అనంతపురంలోని రామ్‌నగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఈ – స్టాంపుల కేంద్రాన్ని ఆమె ప్రారంభించి వినియోగదారులకు ఈ స్టాంపులను అందజేశారు. డీఐజీ మాట్లాడుతూ మ్యానువల్ విధానంలో స్టాంప్ వెండర్లతో స్టాంపులను కొనుగోలు చేసి పాత తేదీలతో విక్రయ అగ్రిమెంట్లు చేసుకుంటూ అక్రమాలకు పాల్పడేవారన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఈ స్టాంపింగ్ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. దీంతో ఏ తేదీన స్టాంపులు కొనుగోలు చేస్తారో అదే తేదీతో స్టాంపులను అందజేస్తారన్నారు. ఈ విధానం పూర్తి పాదర్శకంగా ఉంటుందన్నారు. వినియోగదారులు సైతం ఈ స్టాంపింగ్ విధానంలోనే స్టాంపులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా వాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దశల వారీగా ఈ- స్టాంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో మ్యానువల్ స్టాంపుల మనుగడ ఉండదన్నారు. ప్రస్తుతం జిల్లాలో స్టాంప్ వెండర్లుగా కొనసాగుతున్న వారు సైతం ఈ స్టాంపింగ్ వెండర్లుగా అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఐజీ రికార్డుల తోపాటు రికార్డు డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. వినియోగదారులకు సకాలంలో రిజిస్ట్రేషన్ సేవలను అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం, సబ్ రిజిస్ట్రార్లు సత్యనారాయణమూర్తి, టీజీ రెడ్డి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సాగులో రైతుకు సాయంగా నిలవాలి



మాట్లాడుతున్న అవుటాల రమణారెడ్డి, చిత్రంలో జేసీ చేతన్, అధికారులు

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, దీన్ని గుర్తించి అధికారులూ రైతుకు సాగులో సాయంగా నిలవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అవుటాల రమణారెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ చేతన్, సబ్ కలెక్టర్ కార్తీక్ ,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అవుటాల రమణారెడ్డి మాట్లాడుతూ, 'జలకళ' పథకంలో దరఖాస్తు చేసుకున్న రైతులకు ఉచితంగా బోర్లు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మల్బరీ సాగు విస్తీర్ణం పెంచేలా చూడాలన్నారు. మడకశిర, కొత్తచెరువు మార్కెట్ యార్డుల్లో రైతు బజార్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే రాగి, మొక్కజొన్న పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశుబీమాపై అవగాహన కల్పించి ప్రతి రైతునూ ఆదుకోవాలన్నారు. జగనన్న పాలవెల్లువ పథకంలో మరో 41 గ్రామాల్లో పాలు సేకరించనున్నట్లు తెలిపారు. భూగర్భ జలాలు పెరగడం వల్ల రైతులు బోర్లు వేసుకునే అవకాశం కల్పించాలన్నారు.

విత్తనం వేయకపోతే బ్లాక్ లిస్ట్‌తో పెడతాం..

జాయింట్ కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ, రాయితీతో పొందే విత్తనాలతో తప్పకుండా సాగు చేసేలా చూడాలని, దుర్వినియోగం చేసిన రైతులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించారు. అలాగే ఈ–క్రాప్ బుకింగ్ పక్కాగా చేపట్టాలని, ఆర్‌బీకేల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఏపీఎంఐపీ పరిధిలో దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే డ్రిప్ పరికరాలు అందజేయాలన్నారు. ప్రత్యమ్నాయంగా రాగిపంట సాగు చేసేలా రైతులను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుభదాస్, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, మార్కెటింగ్ అధికారి నరసింహామూర్తి, ఉద్యానశాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్, డ్వామా పీడీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు సత్కారం

- నేడు జిల్లా స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం
- పుట్టపర్తి జెడ్పీ హైస్కూల్లో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం
- 24 మంది ఇంటర్, 29 మంది 'పది' విద్యార్థులకు పురస్కారాలు



ప్రశాంతి నిలయం: పదోతరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించి జిల్లా స్థాయిలో సత్తా చాటిన విద్యార్థుల సన్మానానికి జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం పుట్టపర్తి పుట్టపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సన్మానించనున్నారు.

53 మంది విద్యార్థులకు పురస్కారాలు..

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన విద్యార్థులను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పది, ఇంటర్‌లో పాఠశాల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి 'జగనన్న ఆణిముత్యాలు' ప్రతిభా పురస్కారాలు అందిస్తోంది. ఈ నెల 15 నుంచి నియోజకవర్గ స్థాయిలో ఆణిముత్యాలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం జిల్లా స్థాయిలో 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. పుట్టపర్తి జెడ్పీహైస్కూల్‌లో శనివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితోపాటు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎస్పీలకు ఆహ్వానాలు పంపారు. వారి చేతుల మీదుగా ఎంపిక చేసిన పదో తరగతి విద్యార్థులు 29 మందికి, ఇంటర్ విద్యార్థులు 24 మందికి మొత్తంగా 53 మంది విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. అలాగే వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను సన్మానించనున్నారు. పదో తరగతి విద్యార్థులకు మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.15 వేలు, ఇంటర్ విద్యార్థులకు రూ.50 వేలతో నగదు బహుమతి తోపాటు, ప్రతిభా మెడల్స్ అందజేయనున్నారు.

క్లుప్తంగా

ఆరోపణలపై ఆర్జేడీ బృందం విచారణ



ఎస్‌డీజీఎస్ కళాశాలలో బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

హిందూపురం టౌన్: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాలలో ఒకప్పటి ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆర్జేడీ బృందం శుక్రవారం విచారణ చేపట్టింది. కళాశాలలో యూజీసీ, స్థానిక కళాశాల నిధుల దుర్వినియోగం, మహిళా లెక్చరర్లను వేధించడం తదితర ఫిర్యాదులు ఒకప్పటి ప్రిన్సిపాల్ శ్రీనివాసులుపై వచ్చాయి. కళాశాల యాజమాన్యం అప్పట్లోనే ప్రిన్సిపాల్ శ్రీనివాసులును సస్పెండ్ చేసింది. గతంలో ఓసారి ఆర్జేడీ ఆదేశాలతో విచారణ చేపట్టారు. మరోసారి శుక్రవారం విచారణ బృందం కళాశాలకు వచ్చి విచారణ చేసింది. ఇప్పటికే పలుమార్లు విచారణ చేసినా ఎందుకు ఇప్పటి వరకూ చర్యలు తీసుకోవడం లేదని, విచారణ పేరుతో కాలయాపన చేయకుండా ఇప్పటికైనా సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు కళాశాలలో ధర్నా చేశారు.

విగ్రహాల ధ్వంసం కేసులో నిందితుల అరెస్ట్

తలుపుల: మండలంలోని పాలిమేర గంగమ్మ, జ్యోతివాండ్లపల్లి తండాలోని మారెమ్మ విగ్రహాల ధ్వంసం కేసుల్లో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ సీఐ శివశంకరనాయక్, ఎస్ఐ మగ్బూల్‌బాషా వివరాలమేరకు... విగ్రహాల ధ్వంసం కేసులో ఆవుల మల్లికార్జున , సాకే శాంబ, పూల రమేష్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. వారంతా ఆలయాల్లో చోరీలకు పాల్పడేవారన్నారు. అయితే డబ్బులు దొరకని పక్షంలో ఆలయాలు, విగ్రహాలను ధ్వంసం చేసేవారని తెలిపారు. డీఎస్పీ శ్రీలత ఆదేశాలతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి నిందితులను అరెస్టు చేశామన్నారు. ఆవుల మల్లికార్జునపై అమలాపురం, తాడేపల్లిగూడెం పోలీస్‌స్టేషన్లలో వివిధ కేసులు ఉన్నాయన్నారు. వారి వద్ద నుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రైతులపై దాడి

తనకల్లు: మండల పరిధిలోని రాకుంటపల్లి సమీపంలో శుక్రవారం ఇద్దరు రైతులపై దుండగులు దాడి చేసి గాయపరిచారు. బాధితుల వివరాలమేరకు.. రాకుంటపల్లికి చెందిన శ్రీనివాసులు, ఆదినారాయణ అన్నమయ్య జిల్లా బీ. కొత్తకోటకు ద్విచక్ర వాహనంలో వెళ్లారు. అక్కడ పని ముగించుకున్న అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. అయితే రాకుంటపల్లి దగ్గరకు రాగానే రోడ్డు పక్కనే ఉన్న మామిడితోటలో కొందరు గుర్తుకు తెలియని వ్యక్తులు ఉండటంతో వారిని ప్రశ్నించారు. దీంతో ఆగంతుకులు ఒక్కసారిగా రైతులపై దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీనివాసులు తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం అతన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్రీమంతులు

వారంతా మారుమూల ప్రాంతానికి చెందిన వారే. చదువు పూర్తి కాగానే పొట్ట చేత పట్టుకొని వలసెళ్లిపోయారు. కష్టపడి పనిచేసి వృత్తిలో రాటుదేలడమే కాదు... ఏకంగా సొంతంగా పరిశ్రమలను స్థాపించారు. అందులో సొంత ఊరికి చెందిన వారికి ఉపాధి కల్పిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



బెంగళూరులోని నవ్య ప్యానల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న సిబ్బందితో యజమాని

- పొట్టచేత పట్టుకొని బెంగళూరుకు వలస
- కూలిగా చేరి పరిశ్రమలు స్థాపించే స్థాయికి...
- సొంత ఊరి వారికి ఉపాధి కల్పిస్తున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న గౌడనకుంట యువకులు



హనెస్టో ఇంటీరియర్ పేరిట ఏర్పాటు చేసిన పరిశ్రమ



ఇంటీరియర్ పనులకు కావాల్సిన వాటిని సిద్ధం చేస్తున్న దృశ్యం

అమరాపురం: జిల్లాలో ఉన్న అమరాపురం మండలం కర్ణాటకకు సరిహద్దులో ఉంటుంది. ఇక్కడ విద్యను అభ్యసించే వారు దాదాపుగా కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు, తుమకూరు, దావణగెర తదితర ప్రాంతాలకు వెళ్లి పరిశ్రమలు, ప్రైవేటు కంపెనీల్లో చేరి ఉపాధి పొందుతుంటారు. అయితే మండలంలోని గౌడనకుంట గ్రామానికి చెందిన కొందరు యువకులు ఉన్నత విద్యను పూర్తి చేసి బెంగళూరుకు వెళ్లారు. అక్కడ ఇంటీరియర్ డెకరేషన్ మెటీరియల్ తయారు చేసే పరిశ్రమల్లో ఉద్యోగులుగా చేరారు. అక్కడ మూడు నుంచి నాలుగు సంవత్సరాల పాటు పని చేసి పనులు నేర్చుకుని తాము కూడ ఇలాంటి పరిశ్రమలు ఎందుకు స్థాపించకూడదు అనుకున్నారు. నలుగురు, ఐదుగురు కలసి కొంత సొమ్ములను పోగు చేసి సొంతంగా పరిశ్రమలను స్థాపించారు. అంతేకాదు గౌడనకుంట గ్రామంలోని నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించి అందరి మన్ననలనూ పొందుతున్నారు.

ఒక్కరితో మొదలై...

గౌడనకుంటకు చెందిన శ్రీనివాసయాదవ్ డిగ్రీ పూర్తి చేసుకున్న తర్వాత 2006లో ఉపాధి కోసం బెంగళూరు వెళ్లారు. అక్కడ ఓ ఇంటీరియర్ డెకరేషన్ సంస్థ పనిలో చేరారు. ఉద్యోగిగానే ఉండిపోకూడదని నిర్ణయించుకున్న శ్రీనివాసయాదవ్ 2010లో సొంతంగా శ్రీనవ్యా ప్యానల్స్ అనే ఇంటీరియ్ డెకరేషన్ పేరుతో సొంతంగా వ్యాపారం ప్రారంభించారు. అప్పటి నుంచి ఎంతో కష్టపడి దాన్ని పెద్ద పరిశ్రమగా తీర్చిదిద్దారు. అంతేకాదు ఇప్పుడు దాన్ని రెండు పరిశ్రమలుగా విడదీసి 36 మందికి పైగా ఉపాధి కూడా కల్పిస్తున్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకున్న గౌడనకుంటకు చెందిన తిమ్మారెడ్డి, అనిల్‌కుమార్, ప్రదీప్, వీటీ కుమార్, యంజేరగౌడ, జయసింహ, గుడ్డద శ్రీనివాస్, కొప్పజ్జి శేఖర్, పాలేగార్ సిద్దేశ్వర, గొల్ల గోపినాథ్, సుదాకర్, డిఎస్. రాము, జిటీ.రాము తదితరులు కూడా గృహాలంకరణ పరిశ్రమలను స్థాపించి మండలంలోని ఇతర గ్రామాలకు చెందిన నిరుద్యోగులకు ఉపాధి కలిప్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

250 మందికి పైగా ఉపాధి..

ఒక్కో పరిశ్రమ స్థాపనకు రూ.75 లక్షల నుంచి రూ.కోటి వరకూ వెచ్చించారు. మంచాలు, వంటగదికి కావాల్సిన కబోర్డు, టీవీ స్టాండ్, తదితర వస్తువులను తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. ఇటు తమకు ఆదాయం సమాకూరడంతో పాటు తమ గ్రామ పరిసరాల్లోని నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పిస్తున్నారు. మరికొందరు యూపీవీసీ తలుపులు, కిటికీలు, తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని తమ గ్రామంలోని వారికి ఉపాధి చూపుతున్నారు. 2010లో ఒక్క పరిశ్రమతో మొదలు కాగా ప్రస్తుతం ఆ సంఖ్య 15కు చేరుకుంది. అమరాపురం మండలానికి చెందిన 150 మందితో పాటు మరో 100 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

35 మందికి ఉపాధి కల్పిస్తున్నా



మాది పేద కుటుంబం, కూలికిపోతే కాని పూట గడవదు. డిగ్రీ పూర్తి చేసిన తరువాత పనికోసం బెంగళూరుకు వెళ్లా. అక్కడ అమరాపురం గ్రామానికి చెందిన అశ్వర్థనారాయణ ఉడ్ ఫ్యాక్టరీలో చేరాను. నాలుగేళ్లు వివిధ హోదాలో పని చేశా. సొంతంగా ఫ్యాక్టరీ పెట్టాలనే ఆలోచనతో స్నేహితులతో కలసి 2010లో పరిశ్రమ స్థాపించా. ఇప్పుడు సొంతంగా రెండు పరిశ్రమలు నడుపుతున్నా. మా ప్రాంతాల్లోని 35 మంది యువకులకు ఉపాధి కల్పించా.

– శ్రీనివాస్‌యాదవ్ , గౌడనకుంట

నెలకు రూ.లక్ష ఆదాయం



నేను ఎంబీఏ పూర్తి చేశా. గ్రామంలో ఉండకుండా ప్రైవేటు కంపెనీ పనిచేసే వాడిని. నెలకు రూ.15 నుంచి 20 వేలు వచ్చేది. ఇంటి అవసరాలకు ఆ మొత్తం సరిపోక మా ఊరి యువకులతో మాట్లాడి సొంతంగా గృహాలంకరణ పరిశ్రమ స్థాపించాను. నేను సంపాదించడంతో పాటు మా ఊరి యువకులకు ఉపాధి కల్పిస్తుండటంతో ఎంతో సంతోషంగా ఉంది. అన్ని ఖర్చులూపోను నెలకు రూ.లక్ష ఆదాయం వస్తోంది.

– ప్రదీప్‌కుమార్, గౌడనకుంట

ఆపరేటర్‌గా పనిచేస్తున్నా



నేను పదో తరగతి పూర్తి చేసి బెంగళూరులో ఉపాధి కోసం వెళ్లాను. మొదట పరిశ్రమలో చేరినప్పుడు రూ.10 వేలు ఇచ్చేవారు. ప్రస్తుతం అనుభవంతో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నా. ప్రస్తుతం రూ.20 వేలు జీతం ఇస్తున్నారు. ఇది నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. మాలాంటి నిరుద్యోగులకు మన గ్రామం వారే ఉపాధి కల్పించడం ఆనందంగా ఉంది.

– చంద్రశేఖర్, గౌడనకుంట

క్లెయిముల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 క్లెయిములను త్వరగా పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముకేష్ కుమార్ మీనాకు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈఆర్‌ఓ నెట్, ఈవీఎం గోడౌన్లు, ఎపిక్ కార్డుల పంపిణీ, ఈ పీ కేసులు , ఎస్‌ఓపీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ జిల్లాలో ఫారం 6 క్లెయిములకు సంబంధించి 9201 రాగా 1099 పెండింగ్ ఉన్నాయని చెప్పారు. వాటిని త్వరితగతిన పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఫారం 7కు సంబంధించి 4,364 క్లెయిములు రాగా 784 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఫారం 8కు సంబంధించి 2,526 రాగా 410 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్, ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఆనంద్, తహసీల్దార్ నవీన్‌కుమార్, అహుడా అధికారి చిన్నయ్య, ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.65 వేలు స్వాహా



బాధితుడు గోపాలకృష్ణ

గుత్తి: రైల్వే విశ్రాంతి ఉద్యోగి గోపాల్ కృష్ణ ఏటీఎం కార్డును మార్చి ఓ ఆగంతకుడు ఏకంగా రూ. 65 వేలు స్వాహా చేసిన ఘటన గుత్తిలో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడి వివరాలమేరకు... గుత్తి ఆర్‌ఎస్‌లోని బండి మోటు వీధిలో నివాసముండే రైల్వే విశ్రాంతి ఉద్యోగి గోపాల్ కృష్ణ ఈ నెల 14న డబ్బు డ్రా చేయడానికి గుత్తిలోని కెనరా బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంకులో జనాలు అధికంగా ఉండటంతో అక్కడే ఉన్న ఏటీఎం కేంద్రంలో డబ్బులు డ్రా చేయడానికి వెళ్లాడు. ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేస్తున్న సమయంలో ఓ ఆగంతకుడు నీకు డబ్బులు డ్రా చేయడం తెలియదని, తాను డ్రా చేసిస్తానని నమ్మ బలికాడు. దీంతో గోపాల్ కృష్ణ తన ఏటీఎంను ఆ ఆగంతకుని ఇచ్చాడు. అతను డబ్బులు డ్రా చేస్తున్నట్లు నటించి ఒరిజినల్ ఏటీఎం కాజేసి అచ్చం అలాగే ఉన్న ఏటీఎంను తిరిగి ఇచ్చాడు. అయితే అప్పుడు గోపాల్ కృష్ణ గమనించలేదు. అదే రోజు రాత్రి రూ. 65 వేలు డ్రా చేసినట్లు సెల్‌కు మెసేజ్ వచ్చింది. అవాక్కై ఆరా తీయగా తాను మోసపోయాయని గ్రహించాడు. దీంతో శుక్రవారం బాధితుడు గోపాల్ కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇంటర్ విద్యార్థి మృతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని నీరుగంటి వీధికి చెందిన విద్యార్థి విష్ణుసాయి (15) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... శివకుమార్ అనే వ్యక్తికి విష్ణుసాయితో పాటు కుమార్తె ఉన్నారు. చిన్న అంగడి పెట్టుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమారుడు విష్ణుసాయి నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. అయితే శుక్రవారం ఇంట్లో కరెంటు సమస్యరావడంతో సొంతంగా సరిదిద్దాలని ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలోనే విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే విష్ణుసాయి మృతి చెందదినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు కళ్ల ముందే విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలచి వేసింది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్థానిక వేణుగోపాల్ నగర్‌కు చెందిన రామాంజినేయులు (45) ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నారు. కాగా రామాంజినేయులు మృతికి సంబంధించిన కారణాలు తెలియరాలేదు. బాధిత కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చదివింది ఎంబీఏ.. చేసేది దొంగతనాలు

- చైన్‌స్నాచర్ నుంచి రూ. 3 లక్షల విలువ చేసే బంగారు నగలు స్వాధీనం



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా కేంద్రంలో చైన్ స్నాచింగులకు పాల్పడిన దొంగను అనంతపురం త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 3 లక్షల విలువ చేసే 5 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... రాయపాటి అశోక్‌కుమార్ అలియాస్ అశోక్ అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని పాపంపేటలో నివాసం ఉంటున్నాడు. ఇతను ఎంబీఏ దాకా చదువుకున్నాడు. తల్లిదండ్రులతో పాటు కళ్యాణదుర్గం రోడ్డులో షాపు బాడుగకు తీసుకొని అందులో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్న అశోక్.. దొంగతనాలను మార్గంగా ఎంచుకున్నాడు. ఒంటరిగా సంచరించే మహిళలను టార్గెట్ చేసి వారి మెడలో ఉన్న బంగారు చైన్‌లను దొంగతనం చేయాలనుకున్నాడు. స్థానిక బళ్లారి బైపాస్, ఓ ఫంక్షన్ హాల్ దగ్గర, హౌసింగ్ బోర్డ్ ఎల్ఐజీ కాలనీ, పాతూరు, వాసవీ బాలికల వసతి గృహం వద్ద, శ్రీనివాసనగర్‌లోని బాలాజీ కళ్యాణ మండపం వద్ద మోటార్ సైకిల్‌పై వెళ్లి ఆడవారి మెడలోని బంగారు చైన్‌లను లాక్కొని పరారయ్యాడు. ఎస్పీ కె. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు త్రీటౌన్ పోలీసుస్టేషన్ సీఐ కత్తి శ్రీనివాసులుకు వచ్చిన సమాచారం మేరకు స్థానిక శాంతినగర్ బోర్డు సర్కిల్ వద్ద అశోక్‌ను అరెస్టు చేశారు. దీంతో సీఐ కత్తి శ్రీనివాసులు, ఎస్ఐ వలిబాషా, సిబ్బంది శివయ్య, శ్రీధర్, రాజశేఖర్, రంజిత్, చంద్ర, స్వరూప్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

సమస్యలపై స్పందించిన ఎస్పీ..

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. వివిధ సమస్యలపై ఎస్పీకి 25 వినతులు అందజేశారు. వారితో ముఖాముఖి మాట్లాడిన ఎస్పీ.. సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్‌రెడ్డి, ఎ.హనుమంతు, ఎస్బీ సీఐ ఇందిర, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిని చంపిన కేసులో కుమారుడి అరెస్ట్

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరులో తల్లిని చంపిన కేసులో కుమారుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ రెండురోజుల క్రితం కల్లూరుకు చెందిన రామ్మూర్తి అనే వ్యక్తి కుటుంబ కలహాలతో తండ్రి శ్రీనివాసులపై కొడవలితో దాడిచేయగా తల్లి లక్ష్మీదేవి అడ్డు చెప్పే ప్రయత్నం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో కొడవలి లక్ష్మీదేవికి తగిలి గాయం కావడంతో కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలి భర్త శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు రామ్మూర్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

విడపనకల్లు: మండల పరిధిలోని పాల్తూరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాలమేరకు.. పాల్తూరు పోలీస్‌స్టేషన్‌లో చంద్రమోహన్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. యథావిధిగా శుక్రవారం ఉదయం ఉరవకొండ నుంచి పాల్తూరుకు ద్విచక్ర వాహనంపై విధులకు బయలు దేరారు. అయితే ఉండబండ గ్రామం వద్ద పాల్తూరు గ్రామం వైపు నుంచి వస్తున్న ఓ ద్విచక్ర వాహనం.. కానిస్టేబుల్ చంద్రమోహన్ వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు కాగా అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తలలో రక్తం గడ్డ కట్టడంతో వెంటనే వైద్యులు ఆపరేషన్ చేసి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ధర్మవరం: పట్టణంలోని రేగాటిపల్లి రైల్వే గేట్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి (45) రైలు కింద పడి మృతి చెందినట్లు హిందూపురం రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు లుంగీ, షర్ట్ ధరించి ఉన్నాడని, షర్ట్‌పైన ధర్మవరం శివ టైలర్స్ లేబుల్ ఉందన్నారు. ధర్మవరానికి చెందినవాడేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మృతుని వివరాలు తెలిస్తే 9441238182 అన్న నంబర్‌కు సమాచారం తెలియజేయాలన్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి ..



మృతుడు నరేష్

చెన్నేకొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు పట్టణానికి చెందిన నరేష్ (32) బెంగళూరు నుంచి అనంతపురం వెళ్తున్నారు. అయితే ఎన్.ఎస్. గేట్ ఫ్లైఓవర్ పైకి రాగానే ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఫ్లైఓవర్ గోడను బలంగా ఢీ కొన్నాడు. ఈ ఘటనలో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దారి దోపిడీ

సోమందేపల్లి: మండలంలోని రూకలపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం దారి దోపిడీ జరిగింది. బాధితుడి వివరాలమేరకు.. బోయ నరసింహప్ప పరిగి మండలం గొల్లపల్లి నుంచి తన స్వగ్రామమైన రూకలపల్లికు ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. అయితే రూకలపల్లి సమీపంలోకి రాగానే ఇద్దరు దుండగులు వాహనాన్ని ఆపి నరసింహప్పపై దాడి చేశారు. సెల్‌ఫోన్‌తో పాటు రూ.1000 నగదు బలవంతంగా లాక్కొని పరారయ్యారు. అయితే దాడి దోపిడీపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన రమేష్

గుత్తి: రైలు నుంచి కింద పడటంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన గుత్తి రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్‌పీ ఎస్ఐ నాగప్ప వివరాలమేరకు... చిత్తూరు జిల్లా మొలకలచెరువు మండలం కుమ్మరవానిపల్లికి చెందిన రమేష్ తిరుపతి నుంచి సికిందరాబాద్‌కు పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. అయితే గుత్తి రైల్వేస్టేషన్ సమీపంలో డోర్‌లో నిలుచుని ఉన్న రమేష్ ప్రమాదవశాత్తూ జారి కింద పడ్డాడు. రెండు కాళ్లు రైలు కింద పడటంతో నుజ్జునుజ్జు అయ్యాయి. జీఆర్‌పీ పోలీసులు అతన్ని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. రమేష్‌ను ఇద్దరు వ్యక్తులు రైల్లో నుంచి తోసేశారని మొదట ప్రచారం జరిగింది. అయితే తనను ఎవరూ తోసేయలేదని, ప్రమాదవశాత్తూ జారిపడినట్లు రమేష్ పోలీసులకు తెలిపారు.

భార్యను కత్తితో పొడిచిన భర్త

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి గ్రామానికి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి తన భార్య లతతో శుక్రవారం గొడవపడి కత్తితో పొడిచాడు. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాష్ మూడేళ్ల క్రితం లతను పెళ్లిచేసుకొన్నాడు. ఏడాదిగా అల్లరిగా తిరుగుతూ భార్యను నిర్లక్ష్యం చేసేవాడు. శుక్రవారం రాత్రి భర్తతో లత గొడవపడగా.. క్షణికావేశంతో ప్రకాష్ భార్య కడుపు, మెడపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన లతను చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని అదృశ్యం



షేక్ హమ్రున్ (ఫైల్)

తాడిపత్రి అర్బన్: పట్టణానికి చెందిన ఎంబీఏ విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్ఐ ధరణీబాబు వివరాల మేరకు.. పట్టణంలోని కాల్వగడ్డ వీధికి చెందిన షేక్ హమ్రున్ ఎంబీఏ చదువుతోంది. ఈనెల 14న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఆమె తల్లి షేక్ నూర్జహాన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తేనెటీగల దాడిలో కూలీలకు గాయాలు



గాయపడిన వెంకటమ్మ

తాడిపత్రి: తేనెటీగల దాడిలో ఐదుగురు ఉపాధి హామీ కూలీలు గాయపడిన సంఘటన మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పలువురు ఉపాధి హామీ కూలీలు ఉదయం గ్రామ సమీపంలో ఉపాధి పనులు చేపట్టారు. పనులు చేస్తున్న సమయంలో సమీపంలోని తేనెటీగలు ఒక్కసారిగా కూలీలపై దాడి చేశాయి. వాటి బారి నుంచి బయటపడే క్రమంలో కూలీలు పరుగులు తీశారు. కొందరిపై తేనెటీగలు దాడి చేయడంతో వెంకటమ్మ, బాల హనుమంతు, సునిత, సావిత్రి, నాగ లక్ష్మమ్మలు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటమ్మకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురంకు తరలించారు.